నగరంలో సాయంత్రం బస్సుయాత్ర, రోడ్ షో
కాల్వొడ్డు నుంచి శ్రీశ్రీ సర్కిల్ వరకు పర్యటన
జిల్లా వ్యాప్తంగా భారీ సంఖ్యలో కదలిరానున్న జనం
'నామా' గెలుపే లక్ష్యంగా గులాబీ దళపతి ప్రసంగం
రాత్రికి మాజీ మంత్రి అజయ్‌కుమార్ నివాసంలో బస

# నేడు ఖమ్మానికి కేసీఆర్

ఖమ్మం, ఏప్రిల్ 28 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ రథసారథి, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సోమవారం, మంగళవారాల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పర్యటించనున్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా తెలంగాణ వ్యాప్తంగా బస్సు యాత్ర నిర్వహిస్తున్న ఆయన.. సోమవారం సాయంత్రం ఖమ్మం నగరానికి చేరుకోనున్నారు. ఇప్పటికే పలు జిలాల్లో బస్సు యాత్రను విజయవంతంగా కొనసాగిస్తున్న బీఆర్ఎస్ అధినేత.. మరో కొన్ని గంటల్లోనే ఖమ్మం గడ్డపై అడుగు పెట్టబోతున్నారు. పార్టీ నాయకులను, కార్యకర్తలను ఎన్నికల సంగ్రామంలో కార్యోన్ముఖులను చేసే లక్ష్యంతో కేసీఆర్ ఈ యాత్రను చేపట్టారు. దానిలో భాగంగానే ఖమ్మం పార్లమెంట్ స్థానం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీచేస్తున్న ఖమ్మం సిట్టింగ్ ఎంపీ, బీఆర్ఎస్ లోక్‌సభా పక్షనేత నామా నాగేశ్వరరావు విజయాన్ని కాంక్షిస్తూ ఇక్కడ ప్రచారం చేయనున్నారు. కేసీఆర్ బస్సుయాత్ర, రోడ్‌షోను విజయంతం చేయడానికి ఉమ్మం ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు విశేషంగా కృషిచేస్తున్నారు.




**కార్యకర్తల్లో జోష్ నింపనున్న కేసీఆర్**

గత ఏడాది నవంబర్‌లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బీఆర్ఎస్‌కు ఆశించిన ఫలితాలు రాలేదు. భద్రాచలం నియోజకవర్గం మినహా మిగిలిన 9 నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు ఓటమి చెందారు. ఎన్నికల అనంతరం రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం, ఖమ్మం జిల్లా నుంచే ఆ పార్టీకి చెందిన ముగ్గురు ఎమ్మెల్యేలు మంత్రులుగా ఉండడంతో ఖమ్మం జిల్లా రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. బీఆర్ఎస్‌కు ఉన్న ఒక్క ఎమ్మెల్యే కూడా ఇటీవల కాంగ్రెస్‌లో చేరడంతో బీఆర్ఎస్ నుంచి జిల్లాలో ప్రాతినిధ్యం వహించే వారు లేనట్లయింది. శాసనసభ ఎన్నికల్లో ఓటమి తరువాత బీఆర్ఎస్ శ్రేణుల్లో నయా జోష్ నింపేందుకు, పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీని విజయ తీరానికి నడిపించేందుకు కేసీఆర్ బస్సుయాత్ర దోహద పడుతుందని పలువురు పార్టీ నేతలు, కార్యకర్తలు అభిప్రాయపడుతున్నారు.

**సాయంత్రం రోడ్ షో**

ఖమ్మం నగరంలో సోమవారం సాయంత్రం 5 గంటలకు కేసీఆర్ రోడ్ షో ప్రారంభమవుతుంది. రాత్రి వరకు కొనసాగతుంది. ఖమ్మం నగరంలోని కాల్వొడ్డు ప్రాంతానికి మాజీ సీఎం కేసీఆర్ సాయంత్రం 5 గంటలకు చేరుకుంటారు. అక్కడి నుంచి మయూరిసెంటర్, వైరా రోడ్ మీదుగా జడ్పీ సెంటర్‌కు చేరుకుంటారు. బస్సుయాత్రతోపాటు ప్రజలు కాల్వొడ్డు నుంచి కేసీఆర్ బస్సుతోపాటు జడ్పీ సెంటర్‌కు చేరుకుంటారు. అక్కడ ప్రజలను ఉద్దేశించి గులాబీ దళపతి కేసీఆర్ ప్రసంగిస్తారు. ఆ తరువాత అక్కడ నుంచి ఇల్లెందు క్రాస్ రోడ్ మీదుగా శ్రీశ్రీ సర్కిల్ వరకు రోడ్ షో కొనసాగుతుంది. అక్కడ నుంచి మమత ఆసుపత్రిలోని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఇంటికి కేసీఆర్ చేరుకుంటారు. ఆ రాత్రి అక్కడ బస చేస్తారు. మంళవారం తల్లాడ మీదుగా కొత్తగూడెం చేరుకుంటారు. ఈ బస్సు యాత్రలో ఖమ్మం బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ ఎమ్మెల్యేలు కందాళ ఉపేందర్‌రెడ్డి, బానోత్ మదన్‌లాల్, సండ్ర వెంకటవీరయ్య, మెచ్చా వెంకటేశ్వరరావు, జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు, కేఎంసీ మేయర్ పునుకొల్లు నీరజ, డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు తదితరులు పాల్గొననున్నారు.

## సమన్వయంతో పనిచేస్తే.. భారీ మెజార్టీ ఖాయం

పార్టీ శ్రేణులు క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకం కావాలి
కాంగ్రెస్ పార్టీ అబద్ధపు హామీలను జనంల్లో ఎండగట్టాలి
చండ్రుగొండ సమావేశంలో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి నామా

చండ్రుగొండలో మాట్లాడుతున్న ఎంపీ నామా నాగేశ్వరరావు

చండ్రుగొండ, ఏప్రిల్ 28: పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తే ఈ పార్లమెంటు ఎన్నికల్లో భారీ మెజార్టీ ఖాయమని ఖమ్మం ఎంపీ, ఖమ్మం పార్లమెంటు నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఇందుకోసం పార్టీ శ్రేణులన్నీ క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకం కావాలని పిలుపునిచ్చారు. పార్లమెంటు ఎన్నికలకు కొద్దిరోజుల సమయమే ఉన్నందున శ్రేణులన్నీ రెట్టించిన ఉత్సాహంతో పనిచేయాలని, ఇంటింటికీ వెళ్లి గత కేసీఆర్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని, అందించిన సంక్షేమ పథకాలను వివరించాలని పిలుపునిచ్చారు. ఈ పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఓటు వేయాల్సిన ఆవశ్యకతను వివరించాలని కోరారు. భద్రాద్రి జిల్లా చండ్రుగొండ మండలం తుంగారం గ్రామంలో ఆదివారం జరిగిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తలు, నాయకుల సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఎన్నికలు ఎంతో ప్రతిష్ఠాత్మకమని అన్నారు. పార్టీ విజయం కోసం నాయకులు, కార్యకర్తలు కలిసి మెలిసి పనిచేయాలని సూచించారు. ఈ ఎన్నికల్లో బిఆర్ఎస్ గెలవాల్సిన అవసరాన్ని ప్రజలకు వివరించాలని కోరారు. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందుకు కాంగ్రెస్ చేసిన అబద్ధపు వాగ్దానాలను, గెలిచిన తరువాత చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించాలని సూచించారు. తెలంగాణ కోసం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేసిన కృషిని, గడిచిన పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం అందించిన సంక్షేమాన్ని ప్రజలకు విశదీకరించాలన్నారు. అలాగే, కాంగ్రెస్ ఎన్నికల హామీలపై ఆ పార్టీ నాయకులను అడుగడుగునా నిలదీయాలని పిలుపునిచ్చారు. స్థానికుడు కాని వ్యక్తిని అభ్యర్థిగా ప్రకటించినప్పుడే కాంగ్రెస్ పార్టీ తన ఓటమిని అంగీకరించిందని ఎద్దేవా చేశాడు. సమావేశంలో బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు, అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యేలు మెచ్చా నాగేశ్వరరావు, తాటి వెంకటేశ్వర్లు, బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు దిండిగాల రాజేందర్, లక్కినేని సురేందర్ రావు, కొణకండ్ల వెంకటరెడ్డి, నరుకుళ్ల సత్యనారాయణ, దారా వెంకటేశ్వరరావు, సంగొండి రాఘవులు, సూర వెంకటేశ్వరరావు, భూపతి రమేశ్, గాదె లింగయ్య, మేడా మోహన్‌రావు, గుగులోత్ శ్రీనివాస్‌నాయక్, నల్లమోతు వెంకటనారాయణ, మంద అనిల్, గుగులోత్ రమేశ్, కళ్లెం వెంకటేశ్వర్లు, ఉన్నం నాగరాజు, సత్తి నాగేశ్వరరావు, గుగులోత్ ప్రవీణ్ ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ సారథి బస్సుయాత్రను విజయవంతం చేయండి

- ఖమ్మం, కొత్తగూడెం రోడ్‌షోలకు పెద్ద సంఖ్యలో తరలిరండి
- బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర పిలుపు

ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

ఖమ్మం, ఏప్రిల్ 28: తెలంగాణ సారథి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బస్సుయాత్రను విజయవంతం చేయాలని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర పిలుపునిచ్చారు. ఈ నెల 29, 30, మే 1 తేదీల్లో ఖమ్మం, కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాలో నిర్వహించనున్న రోడ్‌షోలకు ఆయా జిల్లాల ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. స్వరాష్ట్ర సాధన కోసం 14 ఏళ్లపాటు మహోద్యమాన్ని నడిపిన రథసారథి కేసీఆర్ తెలంగాణ ప్రజల చిరకాల వాంఛను సాకారం చేశారని, పదేళ్లపాటు అద్భుత పాలన అందించారని గుర్తుచేశారు. అయితే, అసెంబ్లీ ఎన్నికల సందర్భంలో కాంగ్రెస్ నాయకుల మోసపు వాగ్దానాలకు ప్రజలు కొంత గందరగోళానికి గురి కావడంతో అధికార మార్పిడి జరిగిందని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ నెరవేర్చకపోవడంతో ఆ ప్రభుత్వాన్ని నిలదీసేందుకు, తీవ్ర కరువు పరిస్థితుల్లో ప్రజలకు అండగా నిలిచేందుకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బస్సుయాత్ర చేపట్టారని వివరించారు. ఈ పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు కోసం పార్టీ అధినేత బయలుదేరారని, సోమవారం నుంచి మూడు రోజులపాటు ఖమ్మం, కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల్లో రోడ్‌షోల్లో ఆయన ప్రసంగించనున్నారని వివరించారు. ఈ బస్సుయాత్రను, రోడ్‌షోను ఆయా జిల్లాల ప్రజలు విజయవంతం చేయాలని కోరారు.

## కేసీఆర్ పాలనను ప్రజలు మళ్లీ కోరుకుంటున్నారు

- ఎంపీ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసేందుకు సిద్ధమయ్యారు
- పార్టీ అభ్యర్థులకు అధిక మెజార్టీ వచ్చేలా శ్రేణులు పనిచేయాలి
- కొత్తగూడెంలో రేపటి కేసీఆర్ బస్సు యాత్రను సక్సెస్ చేయాలి
- జూలూరుపాడు సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా
- కాంగ్రెస్‌వన్నీ మోసపూరిత హామీలే: మదన్‌లాల్, ఆర్‌జేసీ కృష్ణ

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు

జూలూరుపాడు, ఏప్రిల్ 28: కేసీఆర్ పాలనను ప్రజలు మళ్లీ కోరుకుంటున్నారని బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు పేర్కొన్నారు. కాంగ్రెస్ అబద్ధపు వాగ్దానాలను, మోసపూరిత హామీలను ప్రజలు గమనించారని అన్నారు. అందుకోసమే ఈ పార్లమెంటు ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసేందుకు సిద్ధమయ్యారని చెప్పారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ శ్రేణులు కూడా సైనికుల్లా ముందుకుసాగాలని, పార్టీ అభ్యర్థులకు అధిక మెజార్టీ అందించేలా పనిచేయాలని పిలుపునిచ్చారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఖమ్మం, మహబూబాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థులు నామా నాగేశ్వరరావు, మాలోత్ కవితల విజయం కోసం సోమ, మంగళవారాల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో జరిగే పార్టీ అధినేత కేసీఆర్ బస్సు యాత్ర, రోడ్‌షోలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. జూలూరుపాడులోని బీఆర్ఎస్ మండల కార్యాలయంలో ఆదివారం జరిగిన పార్టీ సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు గెలుపు కోసం శ్రేణులు నడుంబిగించాలని పిలుపునిచ్చారు. ప్రతి ఇంటికీ వెళ్లి గడిచిన పదేళ్లలో కేసీఆర్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని, అమలుచేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని కోరారు. అదే సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన తప్పు డు హామీలను, వాటిని విస్మరించిన తీరును ప్రజలకు విశదీకరించాలని కోరారు. అలాగే, అధికార పార్టీ నేతల బెదిరింపులను సహించేది లేదని స్పష్టం చేశారు. అబద్ధాల పునాదుల మీద ఏర్పడిన ఈ ప్రభుత్వానికి మనుగడ కష్టమని అన్నారు. ఆగస్టు నాటికి ఆ పార్టీ ఉండదు కాబట్టే కోమటిరెడ్డి వెంకటరెడ్డి ముఖ్యమంత్రి పదవికి అర్హుడంటూ సాక్షాత్తూ సీఎం రేవంత్‌రెడ్డే చెప్పుకుంటున్నారని అన్నారు. అలాగే, బీఆర్ఎస్ బలోపేతానికి చేసేందుకు త్వరలోనే గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. వైరా మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్‌లాల్ మాట్లాడుతూ.. డిసెంబర్ 9 నాడే రుణమాఫీ చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆ తరువాత మాటమార్చిందని అన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో ప్రయోజనం పొందేందుకే మళ్లీ ఆగస్టు 15 అంటూ నాటకమాడుతోందని విమర్శించారు. వైరా నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి ఆర్‌జేసీ కృష్ణ మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన అనతికాలంలోనే కాంగ్రెస్ హామీలన్నీ మోసాలేనని ప్రజలు గుర్తించారని అన్నారు. బీఆర్ఎస్ నాయకులు దిండిగాల రాజేందర్, లాకావత్ గిరిబాబు, యల్లం కి సత్యనారాయణ, పోలుదాసు కృష్ణమూర్తి, చావా వెంకటరామారావు, మూడు చిట్టిబాబు, యదళ్లపల్లి వీరభద్రం, కొడెం సీతాకుమారి పాల్గొన్నారు.

గోదావరి నదిలోకి ఎగువ నుంచి వచ్చి చేరిన నీరు

## పంటలు ఎండాక నీళ్లొచ్చాయ్..

దుమ్ముగూడెం, చర్ల మండలాల రైతులకు జరగాల్సిన నష్టం జరిగిపోయాక స్పందించారు అధికారులు. గోదావరిపై దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద నిల్వ ఉండే నీటి ఆధారంతో ఆ ప్రాంత ఎగువన సుమారు వెయ్యి ఎకరాలకు పైగా రైతులు వరిసాగు చేస్తుంటారు. ఈ ఏడాది యాసంగి పంటకు కావాల్సిన నీరు గోదారిలో లేకపోవడంతో పంటలు ఎండిపోయి చాలామంది నష్టపోయారు. అయితే అప్పుడు రైతులు నీరు ఇవ్వండి మహాప్రభో అని మొత్తుకున్నా అధికారులు ఏమాత్రం స్పందించలేదు. కానీ వారం రోజులుగా దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద గోదారిలో నీరు పుష్కలంగా కనిపిస్తుండడంతో రైతుల గుండె తరుక్కుపోతున్నది. ఈ నీరు అప్పుడే ఇచ్చిఉంటే పంటలు ఎండిపోయేవికావని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్లు అధికారుల తీరు ఉందని అసహనం వ్యక్తం చేస్తున్నారు.

– దుమ్ముగూడెం, ఏప్రిల్ 28

గోదావరి నదిలో నీరు నిరంతరం పారుతూ ఉంటుంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ముందుచూపుతో దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద మరమ్మతులు చేపట్టి నీటిని నిల్వ చేసి ఈ ప్రాంత ఆయకట్టు రైతుల పంటలకు సాగునీరు అందించింది. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నెలరోజుల్లోనే ఆనకట్ట వద్ద నీటిని నిల్వలు తగ్గిపోయాయి. ఎగువ ప్రాంతం నుంచి గోదావరిలోకి నీరు సకాలంలో రాకపోవడంతో దుమ్ముగూడెం, చర్ల మండలాలకు చెందిన సుమారు వెయ్యి ఎకరాల ఆయకట్టు రైతులు యాసంగిలో ఇబ్బందులు పడ్డారు. నీరు లేకపోవడంతో చేతికి వచ్చిన పంటలు ఎండిపోయాయి. ఈ పరిస్థితులపై ఈ నెల 4వ తేదీన నమస్తే తెలంగాణ 'ఎడారి.. గోదారి' అనే శీర్షికతో కథనం ప్రచురించింది. అయితే తాజాగా సంబంధితశాఖ అధికారుల సమీక్షలు ఏర్పాటు చేసుకుని నీటి విడుదలకు సంబంధించి చర్చలు జరపడంతో శ్రీరామనవమి తర్వాత మొదటిగా 1000 నుంచి 1500 క్యూసెక్కుల నీటిని ఏటూరు నాగారంలోని తుపాకుల బ్యారేజ్(సమ్మక్క, సారక్క బ్యారేజీ) నుంచి దిగువ ప్రాంతానికి వదిలారు. దీంతో దుమ్ముగూడెం ఆనకట్టకు నీరు పుష్కలంగా చేరింది. ఇప్పుడు గోదావరిలో నీరు పుష్కలంగా ఉంది.. కానీ పంటకాలం పూర్తికావడంతో రైతులకు ప్రస్తుతం ఆ నీటితో ఎలాంటి ఉపయోగంలేకుండా పోయింది. పంటల సమయంలో మోటర్లకు నీరు అందకపోవడంతో చాలామంది రైతులు నష్టపోయారు. కొంత మంది రైతులు మాత్రమే గోదావరిలో ఇంజన్లు పెట్టి నీటిని తోడుకుని పంటలను అరకొరగా గట్టెక్కించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ముందుచూపు కొరవడడంతో పాటు సంబంధితశాఖల అధికారుల మధ్య సమన్వయం లేకపోవడం, నీటి విడుదల ఏ మేరకు వదలాలో తెలియక సమీక్షల్లో సైతం చర్చించుకోలేక అలస్యంకావడంతో అప్పటికే చర్ల, దుమ్ముగూడెం మండలాల రైతుల పంటలకు జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ఇప్పుడు గోదావరికి నీరు ఎగువ నుంచి వచ్చినా ఆ నీటి వల్ల ఆయకట్టు రైతులకు ఎలాంటి ప్రయోజనంలేదని కొందరు రైతులు బహిరంగంగా అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రైతుల బాధలను గుర్తించి రాబోయే కాలంలో పంటలకు సరిపడా నీటి నిల్వలను ఉంచేలా అధికారులు చొరవ చూపాలని రెండు మండలాల రైతులు కోరుతున్నారు.

- దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద పుష్కలంగా నీరు
- తుపాకుల బ్యారేజ్ నుంచి వదిలిన అధికారులు
- ఆయకట్టు రైతులకు ఉపయోగపడని 'గోదావరి'
- ఇప్పటికే వందల ఎకరాలు ఎండిపోయిన వైనం
- చేతులు కాలాక... ఆకులు పట్టుకున్న చందంగా ప్రభుత్వ తీరు

గతంలో గోదావరి నదిలో పెట్టిన ఇంజన్లు

### లిఫ్ట్‌కు నీరందక పంటలు ఎండిపోయినయ్..

గోదావరిలోని నీరు ప్రగళ్లపల్లి ఎత్తిపోతల పథకానికి అందకపోవడంతో పంటలు ఎండిపోయాయి. ఆయకట్టు పరిధిలో నేను మూడు ఎకరాల వరి సాగు చేశాను. నీరు లేకపోవడంతో సుమారు ఎకరంన్నర పంట నష్టపోయాను. ఇప్పుడు గోదావరికి ఎగువ నుంచి నీరు వచ్చాయ్.. కానీ ఉపయోగంలేకుండా పోయింది. ప్రభుత్వానికి ముందుచూపు లేకపోవడమే ఇందుకు ప్రధాన కారణం.

– కె.సతీష్, రైతు, బండిరేవు

### ప్రభుత్వమే నష్టపరిహారం ఇవ్వాలి

రెండు ఎకరాలు సీడ్ వరి సాగుచేశాను. పంట ఏపుగా ఎదుగుతున్న సమయంలో గోదావరిలో నీరు అడుగంటిపోయింది. లిఫ్ట్‌కు సరిగా నీటి సరఫరా జరగకపోవడంతో రెండెకరాల పంట నష్టపోయాను. ప్రభుత్వం పంట నష్టపరిహారం చెల్లించాలి. భవిష్యత్‌లో రైతులకు ఇలా జరగకుండా చూడాలి.

– కొమ్ము వెంకటేశ్వరరావు, రైతు, బండిరేవు

### చివరి తడి అందక పంట ఎండిపాయె

మూడు ఎకరాల్లో వరి సాగు చేశాను. పంట కోత సమయంలో చివరి తడి నీరు అస్సలు అందలేదు. ఎకరంన్నర పంట పూర్తిగా ఎండిపోయి తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. సుమారు రూ.70 వేలు నష్టపోయా. రైతులను ఆదుకున్న ప్రభుత్వం ఏదైనా ఉందంటే అది బీఆర్ఎస్ ప్రభుత్వమే. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ముందుచూపు లేకపోవడంతో ప్రగళ్లపల్లి లిఫ్ట్ ఆయకట్టు పరిధిలో చాలావరకు రైతులు పంటలు ఎండిపోయి నష్టపోయారు.

– చిరంజీవి, రైతు, బండిరేవు

## స్క్వాడ్ బృందాలు అప్రమత్తంగా ఉండాలి

- జీపీఎస్ ట్రాకింగ్ ద్వారా నిరంతరం పరిశీలించాలి
- ఎన్నికల సిబ్బంది శిక్షణలో భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక

శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక

భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 28 (నమస్తే తెలంగాణ): పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో డబ్బు, మద్యం అక్రమ రవాణా జరుగకుండా చెక్‌పోస్టుల వద్ద ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాల అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక సూచించారు. నియోజకవర్గ, మండల స్థాయి ఎస్ఎస్‌టీ, ఎఫ్ఎస్‌టీ, పోలీస్ సిబ్బందికి ఐడీవోసీలో ఆదివారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. చెక్‌పోస్టుల వద్ద ప్రతి వాహనాన్నీ నిశితంగా పరిశీలించాలని సూచించారు. మోడల్ కండక్ట్ కోడ్ ఉల్లంఘించిన వారిపై తీసుకున్న చర్యల సమాచారాన్ని నివేదిక రూపంలో అందించాలన్నారు. ఎటువంటి ఘటనలనైనా సీసీ కెమెరాలు ద్వారా పరిశీలించాలన్నారు. డబ్బు, మద్యం తదితర వస్తువులు పట్టుబడిన సందర్భంలో వీడియో రికార్డింగ్ చేయాలని ఆదేశించారు. రాజకీయ పార్టీలు మీటింగ్‌లు, బ్యానర్లు తదితర సామగ్రి పట్టుబడిన సర్వేలెన్స్ అధికారులు రికార్డు చేయాలన్నారు. ఎన్నికల నియమావళి ప్రకారం ప్రజలు రూ.50 వేలు లోపు నగదును తీసుకెళ్లేందుకు మాత్రమే అనుమతి ఉందని అన్నారు. అంతకుమించిన నగదును తరలిస్తే అధికారులు పట్టుకుంటారని అన్నారు. అప్పుడు ఆ నగదుకు సరైన ఆధారాలు చూపించాలని సూచించారు. ఎన్నికల సూపరింటెండెంట్ దారా ప్రసాద్, ఎన్నికల లైజన్ అధికారి సంజీవరావు, ఎస్ఎస్, ఎఫ్ఎస్‌టీ బృందాల అధికారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.